


## అభయకు న్యాయం చేద్దాం..

- కుటుంబానికి అండగా ఉందాం..
- బొజ్జ గణపయ్యల వద్ద వైద్యుల వినూత్న నిరసన
- ఫ్లెక్సీ పెట్టి న్యాయం చేయాలంటూ ప్రదర్శన

8లో..

సంపుటి : 04 | సంచిక : 07
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
సెప్టెంబర్ 13, 2024

# వరంగల్ వాయిస్

Evening Daily
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net






# అరికెపూడి vs పాడి



- చిలికిచిలికి గాలివానగా మారిన వైనం
- గాంధీ ఇంటి వరకు ర్యాలీకి బీఆర్ఎస్ పిలుపు
- ఎక్కడికక్కడే నేతల హౌజ్ అరెస్ట్
- అడుగు బయట పెట్టకుండా దాస్యంను అడ్డుకున్న పోలీసులు
- మానుకోటలో రాస్తారోకో

వివరములు2లో..

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిల మధ్య వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. ఇది ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పెద్ద దుమారమే లేపుతోంది. రెండో రోజూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, రాస్తారోకోలతో బీఆర్ఎస్ నేతలు కదం తొక్కారు. పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ఇంటి వరకు ర్యాలీగా వెళ్లి సమావేశం నిర్వహిస్తామంటూ బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే వారిని హౌస్ అరెస్టు చేశారు. అడుగు బయట పెట్టకుండా నిలువరించారు. హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ ను పోలీసులు అడ్డుకునేప్రయత్నం చేశారు. పార్టీ కార్యాలయం గేటు మూసివేసి అక్కడికి వచ్చే పార్టీ శ్రేణుల వివరాలు నమోదు చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సెంటర్ లో బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. - వరంగల్ వాయిస్, వరంగల్

## ఓ బొజ్జ గణపయ్యా.. ఆరగించగ రావయ్యా..



సత్యం సంస్థలో 108 రకాల నైవేద్యాలు

నగరంలోని ప్రముఖ సత్యం కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ సంస్థలో గణపతి నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం గణనాథునికి 108 రకాల ఫల, పిండి పదార్థాలతో నైవేద్యాలు సమర్పించారు. సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థల అధినేత, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో పూజిస్తే సకల కోరికలు నెరవేరుతాయన్నారు. గత 23 సంవత్సరాలుగా తమ సంస్థలో నవరాత్రి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలంతా స్వామివారి కృపతో సుఖ సంతోషాలతో ఉండాలని రవికుమార్ ఆకాంక్షించారు. – **వరంగల్ వాయిస్, కాశిబుగ్గ**




2లో..

## సమాజ హితం కోసం అక్షర పోరాటం సాగించాలి

**గడ్డం కేశవమూర్తికి ఘన సన్మానం**

**ఆత్మీయంగా సత్కరించిన పద్మశాలీ కుల పెద్దలు**

# అరెకపూడి V/s పాడి

- చిలికిచిలికి గాలివానగా మారిన వైనం
- గాంధీ ఇంటి వరకు ర్యాలీకి బీఆర్ఎస్ పిలుపు
- ఎక్కడిక్కడే నేతల హౌజ్ అరెస్ట్
- అడుగు బయట పెట్టకుండా
- దాస్యంను అడ్డుకున్న పోలీసులు
- మానుకోటలో రస్తారోకో



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య పచ్చిగడ్డి వేస్తే మండుతోంది. పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిల మధ్య వివాదాన్ని రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో వివాదం ముదిరి పాకాన పడింది. ఎవరికివారు తగ్గేదే..లే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వరుసగా రెండో రోజు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పెద్దలు పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పార్టీ నాయకులు గడప దాటి బయట అడుగు పెట్టకుండా అడ్డుకున్నారు. కాదని ఎవరైనా వ్యవహరిస్తే ఎక్కడికక్కడే అరెస్టులు చేసి ఠాణాలకు తరలించారు.

## పోలీసుల నిర్బంధంలో వినయ్..

పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడి, మాజీ మంత్రులు అరెస్టులు, నిర్బంధాలు, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా.. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మీడియాతో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్ ను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆగ్రహించిన వినయ్ భాస్కర్ పార్టీ కార్యకర్తలు, ప్రజలను కూడా కలవనివ్వరా అంటూ పోలీసులపై అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలోకి వచ్చేవారి వివరాలను పోలీసులు సేకరించడంపై సీరియస్ అయ్యారు. పార్టీ కార్యాలయం గేట్లను ఎందుకు మూసివేస్తున్నారని, కార్యకర్తల వివరాలు మీకెందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమని అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం హైదరాబాద్ వెళ్లేందుకు యత్నించిన దాస్యంను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు పోలీసులకు, పార్టీ శ్రేణులకు మధ్య వాగ్వాదం జరిగింది.

## మహబూబాబాద్ లో..

వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సెంటర్ లో బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ..రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలపై, ఇండ్లపై దాడులకు పాల్పడడంతోపాటు అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు అర్ధరాత్రినుంచే బీఆర్ఎస్ శ్రేణులకు ఫోన్ లు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దాడులను ఆపకపోతే తీవ్ర పరిణామాలు చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరకాల శ్రీనివాస్, రెడ్డి శీను, వెంకన్న రవికుమార్, అశోక్, యాదవ్ తోపాటు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## 40వ డివిజన్ లో..

ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడానికి అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు రౌడీయిజం చెలాయిస్తున్నారన్నారు. హుజూరాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ తన గుండాలతో దాడి చేయించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు హైదరాబాద్ కు తరలి వెలుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులను మిల్స్ కాలనీ సీఐ మల్లయ్య అరెస్టు చేయడం సరి కాదన్నారు. మిల్స్ కాలనీ పోలీసులు అరెస్టు చేసిన వారిలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, దిడ్డి కుమార స్వామి, నాయకులు పూజారి విజయ్, వనం కుమార్, గజ్జి సాంబయ్య, పోలేపాక మల్లేశం తదితరులు ఉన్నారు.








## రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు..

కోకాపేటలోని నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు గృహనిర్బంధం చేశారు. గురువారం సీపీ కార్యాలయం వద్ద జరిగిన తోపులాటలో తన భుజానికి గాయమైందని.. ఆస్పత్రికి వెళ్తానని ఆయన చెప్పినప్పటికీ పోలీసులు నిరాకరించారు. తామే ఆస్పత్రికి తీసుకెళ్తామంటూ అడ్డుకున్నారు. హరీశ్‌రావు నివాసం లోపలికి వెళ్లకుండా మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవితను గేటు బయటే నిలిపివేశారు. దీంతో వారు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారిద్దరిని అక్కడినుంచి తరలించారు. హరీశ్ రావును కలవడానికి వచ్చిన బీఆర్ఎస్ నేతలను ఎవరినీ అనుమతించడం లేదు. మరోవైపు శ్రీనగర్ కాలనీలోని ఇంట్లో సబితా ఇంద్రారెడ్డిని, వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గృహనిర్బంధం చేశారు. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానంద నివాసం, క్యాంపు ఆఫీసు వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి నుంచి బీఆర్ఎస్ నేతలు ర్యాలీగా బయల్దేరాలని నిర్ణయించారు. దీంతో ఆయన నివాసం వద్ద పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి నివాసాల వద్ద కూడా భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అరెకపూడి గాంధీ నివాసానికి బయల్దేరిన కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజును పోలీసులు అడ్డుకున్నారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఇంటికి వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని.. దానం నాగేందర్‌ను ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అక్కడికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి మల్లారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్సీ శంభీపూర్ నివాసానికి బయలుదేరిన మల్లారెడ్డిని ఇంటి వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. అయితే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడి చేసిన ఎమ్మెల్యే గాంధీ, వారి అనుచరులు, కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు.

# సమాజ హితం కోసం అక్షర పోరాటం సాగించాలి

- గడ్డం కేశవమూర్తికి ఘన సన్మానం
- ఆత్మీయంగా సత్కరించిన పద్మశాలీ కుల పెద్దలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ వాయిస్ సాయంకాలం దినపత్రిక ఎడిటర్, పూర్వ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత గడ్డం కేశవమూర్తిని అఖిల భారత పద్మశాలీ సంఘం బాధ్యులు శుక్రవారం ఆత్మీయంగా సత్కరించారు. వరంగల్ వాయిస్ సాయంకాలం దినపత్రిక మూడో సంపుటి పూర్తి చేసుకొని నాలుగో సంపుటితో వార్షికోత్సవం జరుపుకున్న తరుణంలో అఖిల భారత పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి పులికంటి రాజేందర్, గుండ్రాతి సురేష్, స్వామి తదితరులు గడ్డం కేశవమూర్తిని కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి, పూల కుండి అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలీ సంఘం బాధ్యులు మాట్లాడుతూ వరంగల్ వాయిస్ దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల మన్ననలు పొందుతూ పలు సంచలనాత్మకమైన కథనాలతో దూసుకెళుతుందని అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలనే కథనాలుగా మలుస్తూ వాటికి పరిష్కారాలను చూపిస్తూ తనదైన శైలిలో వరంగల్ వాయిస్ దినపత్రిక దినదిన ప్రవర్ధమానంగా నడుస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాసమస్యలనే తమ అజెంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# స్నేహ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని శిరంగి రాజా రాం తోట పరిధిలోని స్నేహ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ దాత శ్రేష్ఠ హోటల్ యజమాని అనుమాండ్ల హరి ప్రసాద్, బుధారపు వివేక్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో 32, 33 డివిజన్లకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత స్నేహ యూత్ అసోసియేషన్ సభ్యులు అన్న దాత అనుమాండ్ల హరి ప్రసాద్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## అంగన్వాడీ పిల్లలకు ఆటల పోటీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక కేయూ డబ్బాలు పరిధిలోని పోచమ్మకుంట సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల ప్రీస్కూల్ పిల్లలకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ విశ్వజ హాజరై ఆటల పోటీలలో గెలిచిన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏరియా సూపర్ వైజర్ సుజన, అంగన్వాడీ కార్యకర్తలు ఇందిర, విజయ నిర్మల, కల్యాణి, స్వరూప, వసుమతి, మమత, ఆయాలు యశోద, భూలక్ష్మి, జ్యోతి, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



## పాలిటెక్నిక్ కళాశాలను బీటెక్ కళాశాలగా అప్డేట్ చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమాలకు ఊపిరి పోసిన పరకాలలోని పాలిటెక్నిక్ కళాశాలను బీటెక్ కళాశాలగా మార్చాలని భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను కాలేజ్ సర్వీస్ కమిషన్ మంత్రివర్గంలో బీటెక్ కళాశాలగా అప్డేట్ చేశారని తెలిపారు. అదేవిధంగా పరకాల పట్టణంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను బీటెక్ కళాశాలగా మార్చాలని ఆయన కోరారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ముందుండి పోరాడిన పరకాల గడ్డకు తీరని నష్టం జరిగిందని, జిల్లా కావలసినటువంటి పరకాలను అప్పటి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పరకాల పట్టణంలో ఎంబీబీఎస్ కళాశాల, వంద పడకల ఆసుపత్రి, బీటెక్ కళాశాలతో పాటు నిరుద్యోగులకు ఎక్కువ శాతం టెక్స్ టైల్ పార్కులో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## గణపతికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని 14వ డివిజన్ సాయి గణేష్ కాలనీ రోడ్డు నెంబర్-4లో శివగణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల ఉత్సవాల ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గణేష్ పూజా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన-సారయ్య విచ్చేసి గణపతి మహరాజ్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఆడెపు పాపయ్య, క్యాతం వీరస్వామి, గూడూరు కృష్ణ దంపతులు, కుమారస్వామి దంపతులు, యూత్ సభ్యులు కొడారి శ్రవణ్ కుమార్ యాదవ్, తేజావత్ సతీష్, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సమస్యలు పరిష్కరించాలి

## ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) జాతీయ కమిటీ పిలుపు మేరకు ఏఐకేఎఫ్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ముందు ధర్నా చేసి డీఆర్ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస మద్దతు ధర నిర్ణయించి చట్టం చేయాలని, రుణ విముక్తి చట్టం తీసుకురావాలని, ఎంఎస్పీ సీ2 50 శాతం కొనుగోలు హామీ చట్టం అమలు చేయాలన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ ఎత్తి వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని బేషరత్తుగా రైతులందరికీ




వర్తింపజేయాలన్నారు. 2022 విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని, కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు, పంట రుణాలు, ప్రభుత్వ పథకాలు, రైతు బీమా, పంట నష్టపరిహారం వర్తింపజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన రైతులకు నెలకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. మార్కెట్ దోపిడిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి, ఏఐకేఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుసం బుచ్చన్న, జిల్లా కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి, నీల రవీందర్, మాస్ సావిత్రి, మంద భద్రయ్య, మొగిలి శ్రీనివాసరావు చీపురు ఓదయ్య రవీందర్, మటేడా మొగిలి, ఇసం రాజిరెడ్డి, కర్ర వెంకట్ రెడ్డి, కునూరు వెంకటేశ్వర్లు, సూరి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రేవూరిని కలిసిన చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో తనపై ఎంతో నమ్మకంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తనను పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమించినందుకు పరకాల రేవూరి ప్రకాశ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి బోకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏఎంసీ చైర్మన్ గా తన నియామకానికి సహకరించిన పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, పరకాల కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ స్వర్ణలత, చైర్మన్ సోద అనిత-రామకృష్ణ, కౌన్సిలర్లకు, వివిధ గ్రామాల ఎంపీటీసీలకు, సర్పంచులకు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చినందుకు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటూ పరకాల మార్కెట్ ను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. వ్యాపారస్తులను, అధికారులను ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి ఎంపీటీసీ పర్నెం మల్లారెడ్డి, మల్లక్కపేట మాజీ సర్పంచ్ అల్లం రఘు నారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, చందుపట్ల రాఘవరెడ్డి, పుట్ట రాజు, మహ్మద్ అలీ, లక్కం శంకర్, దార్న వేణుగోపాల్, సాయి, మార్క కిరణ్, నాగారం బీరప్ప దేవాలయ చైర్మన్ పోతురాజు కోటి, ఒంటేరు వరుణ్, రాంకొంరు, మోహన్ రావు, రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ క్రిస్టియన్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్, హుజూరాబాద్ వారు గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం వారి తమ్ముడు గంగిశెట్టి జగదీశ్వర్ రూ.25వేల విలువ గల 250 స్టీల్ ప్లేట్లను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణయ్య మాట్లాడుతూ దాన గుణం చాలా గొప్పదని, డబ్బులుండగానే సరిపోదు.. సేవ చేసే మనస్తత్వం ఉండాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు జగదీశ్వర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అనే దృక్పథంతో పేద విద్యార్థులకు సేవ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏఆర్సీ చైర్మన్ పద్మలత, ఉపాధ్యాయులు సుదాబిందు, రమాదేవి, దేవరాజు, రాములు, కళ్యాణ్, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, కృష్ణకుమార్, సంపత్, మాస్మిన్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే గర్భిణీలకు సంపూర్ణ ఆరోగ్యం

## ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పుణ్యవతి



**వరంగల్ వాయిస్, పరకాల :** అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతోనే గర్భిణిలకు సంపూర్ణ ఆరోగ్యమని పరకాల ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ పుణ్యవతి అన్నారు. గురువారం పరకాల మండలం నాగారం గ్రామంలో ఒకటి, రెండు, నాలుగు, ఐదు అంగన్వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో మహిళా సమైక్య భవనంలో అంగన్వాడీ టీచర్స్ పౌష్టికాహారంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుణ్యవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గర్భం దాల్చిన ప్రతి మహిళ తమరి పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకొని అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో పండించుకున్న ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తినాలని, పుట్టే పిల్లలు ఆరోగ్యవంతులుగా పుడతారని తెలియజేశారు. రక్తహీనతతో బాధపడుతున్న కిశోర బాలలకు అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టిక ఆహారం తినిపించాలని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే ఆహారం పౌష్టికాహారమని, వాటిలో అధిక సంఖ్యలో పోషకాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, ఏఎన్ఎం, సీఏ, ఆశా వర్కర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడీ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఏచూరి మరణం కమ్యూనిస్టులకు తీరని లోటు

## సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారామ్ ఏచూరి మరణం కమ్యూనిస్టులకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్ అన్నారు. శుక్రవారం తొర్రూరు మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద సీపీఎం అఖిల భారత కార్యదర్శి ఉత్తమ పార్లమెంటేరియన్, కామ్రేడ్ సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏచూరి మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. వారు ఉత్తమ పార్లమెంటేరియన్ గా పేద ప్రజల హక్కుల కోసం అనేక ఉద్యమాలను రూపొందించిన మహామేధావి అని కొనియాడారు. ప్రపంచ కమ్యూనిస్టులంతా ఏకం కావాలని, సంకల్పంతో అనేక దేశాలతో సత్సంబంధాలు కలిగి ఏకతాటికి తీసుకొచ్చి ప్రపంచ కమ్యూనిస్టు మహాసభలను నిర్వహించిన నాయకుడని కొనియాడారు. ఆయన ఉన్నత చదువులు చదివిన కూడా పేదల ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీలో చేరి నిత్యం ప్రజా ఉద్యమాల్లో, పార్లమెంటరీ ఉద్యమాల్లో ఆయన ఎప్పుడూ ప్రజల పక్షమై వహించేవారని అన్నారు. కార్మిక, కర్షక ఉద్యమాల వాణిని వినిపించిన వారు పేద ప్రజల ఐక్యం కోసం కుల, మత వైషమ్యాలు లేని భారత సమాజం కోసం కృషి చేశారని కొనియాడారు. వారి మరణం




సీపీఎంకు, భారత ప్రజానీకానికి తీరని లోటని, సీపీఎం పార్టీ కార్యకర్తలు అంతా ఆశయ సాధన కోసం కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎండీ యాకోబ్, మండల కమిటీ సభ్యులు డోనక దుర్గయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీను, దస్తగిరి, రాజబాబు, శ్రీను, వెంకన్న, రవి, భాస్కర్, సాంబయ్య, స్వామి, యాకన్న పాల్గొన్నారు.

## ధోణగుట్ట లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 31వ డివిజన్ న్యూ శాయంపేటలోని దొణగుట్ట శ్రీశ్రీశ్రీ త్రివేదాద్రి సంతోష లక్ష్మీనృసింహ స్వామి వారిని శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దొణగుట్ట ఆలయ అభివృద్ధికి అన్నివిధాలుగా అండగా ఉంటానని, స్వామి వారి నిత్య కైంకర్యాలకు ఎలాంటి ఒడిదోడుకులు లేకుండా జరిపించాలని కోరారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ దుర్గామాత అమ్మని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే నాయినికి పూర్ణకుంభంతో స్వాగతం పలికగా ఆయన ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ధోణగుట్టలో ఏర్పాటు చేసిన శ్రీ గణేశ స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## సమాజ హితం కోరి నేత్రదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ ఓ సిటీకి చెందిన గుత్తికొండ రాజేశ్వరి (71) శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మరణించారు. సమాజహితం కోరి వారి కుమారులు గుత్తికొండ అజయ్, అమర్ చంద్, ఇతర కుటుంబ సభ్యులు రాజేశ్వరి నేత్రదానానికి సమ్మతించారు. ఎల్ వీ ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ , హైదరాబాద్ టెక్నీషియన్ లక్ష్మణ్, నరేందర్, గుత్తికొండ రాజేశ్వరి నేత్రాలను సేకరించారు. గుత్తికొండ రాజేశ్వరి తమ నేత్రదానంతో, బంధుమిత్రులకు, తోటివారికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

## పేద విద్యార్థి నిఖిల్‌కు ఆర్థిక సహకారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఇండియా -మిషన్ విద్య విజ్ఞాన్ సేవలో భాగంగా శుక్రవారం చింత నెక్కొండ, వరంగల్ ఇస్రో యంగ్ స్టూడెంట్ సైంటిస్ట్ విద్యార్థి నిఖిల్ కు తన ఐఏటీ పరీక్ష సన్నద్ధం కావడానికి ఒక సంవత్సరానికి కోచింగ్ కావాల్సిన అమౌంట్ రూ.6,299 ఆన్ లైన్ లో పేమెంట్ చేసి, అందుకు డొనేషన్ సర్టిఫికెట్ ఫౌండేషన్ దాత వి. రమేష్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జె.జయకృష్ణ ఐఐటీ రోపార్, కోఆర్డినేటర్ రవి సీనియర్ జర్నలిస్ట్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జయకృష్ణ మాట్లాడుతూ, ప్రతిభ గల పేద విద్యార్థి అయిన నిఖిల్ గురించి రవి సీనియర్ జర్నలిస్ట్, టీచర్ నర్సయ్య తమ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు- మోహన్ శాస్త్రవేత్తకు తెలియజేశారని, అన్ని పరిశీలించిన తర్వాత దాత వి.రమేష్ సహకారంతో కోచింగ్ అమౌంట్ ఆన్ లైన్ లో పేమెంట్ చేశామన్నారు. అలాగే, భవిష్యత్తులో ఇంకా విజయాలు సాధించాలని, నిఖిల్ కు అండగా ఫౌండేషన్ ఉంటుందన్నారు. విద్యార్థికి కావాల్సిన సహకారం తన తమ్ముడిగా దాత వి. రమేష్ చూసుకుంటారని చెప్పడం హర్షనీయమని తెలిపారు. పేద విద్యార్థుల మేలు కోసం ప్రతి సంవత్సరం ఆర్థిక సహకారం చేస్తున్న దాత వి.రమేష్ కు ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. నిఖిల్ తనకు అవసరం ఉన్న సమయంలో ఆర్థిక సహకారం చేసినందుకు ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. పేద విద్యార్థులు తమ డౌట్స్, గైడెన్స్, సహకారం కోసం తమ ఫౌండేషన్ వాట్సాప్ హెల్ప్ లైన్ నెంబర్ 78927 82387 కు సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని పద్మనాయక వెలమ యూత్ అసోసియేషన్ వెలమ వాడ-2 ఆధ్వర్యంలో మట్టి గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇలాగే ప్రతి సంవత్సరం మట్టి గణపతినే పూజించి, కాలుష్యం లేకుండా పర్యావరణాన్ని కాపాడాలన్నారు. గత 10 సంవత్సరాలుగా మట్టి గణపతి నెలకొల్పుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని యూత్ అధ్యక్షుడు ప్రమోద్ తెలిపారు. శుక్రవారం కుంకుమ పూజలో మహిళామణులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని , తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేణు గోపాల్ రావు, రాకేష్ రావు, సాయి చరణ్ రావు, వీరరావు, సంజు, కళ్యాణ్, వెంకట్ రావు, ప్రవీణ్, దీప్తి, శైలజ, స్వీటీ, అనూష, జ్యోతి పాల్గొన్నారు.

## ఘనంగా నవీన్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ బీఆర్ఎస్ నాయకుడు శనిగరపు నవీన్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి సారంగపాణి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు దుంపేటి నాగరాజు, కౌన్సిలర్లు ఆడప రామన్న , చందుపట్ల సుజాత సాయి తిరుపతి రెడ్డి, గొర్రె స్రవంతి రాజు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ గందే వెంకటేశ్వర్లు, కో-ఆప్షన్ సభ్యులు ముఫీనా ఫాతిమా హమీద్ యూత్ ప్రధాన కార్యదర్శి దుప్పటి సుజయ్ రణదేవ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నక్క చిరంజీవి, యూత్ నాయకులు ఇంగిలి వీరేశ్ రావు, నాయకులు మక్సూద్ అలీ, చేరిపెల్లి రాజేందర్, మనోహర్ శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి ప్రారంభం

### హాజరైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, జిల్లా డీఎంహెచ్ఓ గుండాల మురళీధర్ తో కలిసి ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైనదని, ప్రజలు ఆ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధికంగా నిధులు కేటాయిస్తుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ప్రజలు ఆయుర్వేద వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద ఆసుపత్రి వైద్యుడు కిరణ్ కుమార్, వైద్యులు జ్వలిత, మీరాజ్, ఆయుర్వేద వైద్య సిబ్బంది, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వార్డు కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత మహిళకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 36వ డివిజన్ ఏసీ రెడ్డి నగర్‌లో భర్త లేని నిరుపేద మహిళ పరమేశ్వరి క్యాన్సర్ బారిన పడింది. ఆమెకు చికిత్స చేయించుకోవడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయం స్థానికుల ద్వారా సామాజికవేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎల్. శ్రీనివాస్ తెలుసుకొని శుక్రవారం వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వెయిటేజీ మార్కులపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం 1271 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ వేసిందని నోటిఫికేషన్ లో ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెయిటేజీపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ప్రభుత్వం నోటిఫికేషన్ వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా చెప్పిన విధంగా నోటిఫికేషన్ లో చాలా అవకతవకలు ఉన్నాయని, గత 24 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ లో పనిచేస్తున్న ఉద్యోగులంతా చాలా నష్టపోతామని ఆయన వాపోయారు. గత ప్రభుత్వం ఏఎన్ఎంలకు సంబంధించిన నోటిఫికేషన్ లో వెయిటేజీ మార్కులు 30 మార్కులు ఇవ్వగా, దానికి సమాన క్యాడర్ అయిన ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ లకు నోటిఫికేషన్ లో మాత్రం 20 మార్కులు వేయడం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నోటిఫికేషన్లు పరిశీలించి ఏఎన్ఎంలకు ఇచ్చిన 30 వెయిటేజీ ల్యాబ్ టెక్నీషియన్లకు, ఫార్మసిస్టులకు ఇవ్వాలని రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. లేదంటే నోటిఫికేషన్ పై కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ నేతల అరెస్ట్ అప్రజాస్వామికం



**వరంగల్ వాయిస్, రేగొండ :** హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ నిరసనలు, ధర్నాలు చేస్తారని పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టుకు నిరసనకు దిగుతారానే ఉద్దేశంతో ముందస్తుగా పోలీసులు బుధవారం రాత్రి నుంచి గాలింపు చర్యలు చేపట్టి బీఆర్ఎస్ నాయకులు ఇండ్ల నుంచి తీసుకెళ్లి ముందస్తు అరెస్టులు చేశారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్ సహా మాజీ సర్పంచులు దగ్గు వెంకటేశ్వరరావు, బొక్క భాస్కర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ కొలుగోరి రాజేశ్వరరావు, బీసీ మండల అధ్యక్షుడె బండి రమేష్ గౌడ్, గంపల లింగన్న, గోగుల చంద్రకర్ రెడ్డి, లింగంపల్లి గోపాల్ రావు ఉన్నారు. స్థానిక ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. విడుదల అనంతరం మండలఅధ్యక్షుడు అంకం రాజేందర్ మట్లాడుతూ అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమని, ఇంట్లో ఉన్న వాళ్లని అరెస్ట్ చేయడం ఏంటని బీఆర్ఎస్ పార్టీ రేగొండ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులా ఉందని విమర్శించారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పరకాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి జైపాల్ రెడ్డి, కుంకుమేశ్వర ఆలయ మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు అన్నారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ శ్రేణులను తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా, బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యేపై దాడి చేసిన ఎమ్మెల్యే గాంధీ, వారి అనుచరులు, కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ ఎపిసోడ్, నిన్న సీపీ కార్యాలయం ఎదుట హరీష్ రావు నిరసన నేపథ్యంలో ఎక్కడికక్కడ ముఖ్య నేతల అరెస్టుల పర్వం జరిగింది. శాంతిభద్రతలు పరిరక్షించడం అంటే ప్రతిపక్షాలను అక్రమంగా నిర్బంధించి అధికార పార్టీ నేతలను ఉసిగొల్పడం కాదని వారు మండిపడ్డారు. ప్రజా పాలన ముసుగులో నియంత పాలన సాగుతుందని విమర్శించారు.

# పంచాయతీల అభివృద్ధిలో ఎంపీడీఓల పాత్ర కీలకం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా పరిషత్‌లో ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారిగా పని చేసి బదిలీ అయిన పవన్‌కు మండల పరిషత్ అభివృద్ధి అధికారుల తరఫున శాలువాతో సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అలాగే వారి స్థానంలో నూతనంగా జాయిన్ అయిన నూతి వసుమతికి పూల మొక్క, శాలువాతో ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా చేరిన నూతి వసుమతి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఎంపీడీఓల పాత్ర కీలకమని, అందరూ కష్టపడి పని చేసి జిల్లాను ఉన్నత స్థాయిలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఆత్మకూరు ఎంపీడీఓ మొగుళ్ల శ్రీనివాస్ రెడ్డి, శాయంపేట ఎంపీడీఓ ఫణిచంద్ర, నడికూడ ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు ఎంపికైన సామల శ్రీ చేతన్ శౌర్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 14 నుంచి 19 వరకు వెస్ట్ బెంగాల్ లోని కోల్ కత్తాలో జరుగుతున్న ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్-13) బాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ కు వరంగల్ జిల్లా జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియం బాడ్మింటన్ ప్లేయర్ సామల శ్రీ చేతన్ శౌర్య టోర్నమెంట్ మెయిన్ డ్రాకు ఎంపికయ్యారు. శ్రీచేతన్ శౌర్య ఆల్ ఇండియాలో డబుల్స్ లో 3వ ర్యాంక్, సింగిల్స్ లో 4వ ర్యాంక్ లో ఉన్నాడు. బాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్ వద్ద శ్రీ చేతన్ శిక్షణ పొందుతున్నారు. క్రీడాకారుడిని డబ్ల్యూ డీబీఏ సెక్రటరీ పింగిలి రమేష్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్ లింగం, బాడ్మింటన్ కోచ్ శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ గూడెపు రమేష్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# టూరిజంతో ఎన్నో ఉపాధి అవకాశాలు

## జిల్లా టూరిజం అధికారి శివాజీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ జూనియర్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టూరిజం, ఉపాధి అవకాశాలపై సదస్సును ఏవీవీ "యువ టూరిజం క్లబ్ "ఏర్పాటు చేయడం జరిగింది. ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనిత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా టూరిజం అధికారి శివాజీ ఏవీవీ "యువ టూరిజం క్లబ్" ఏర్పాటు చేస్తూ టూరిజంతో ఎన్నో ఉపాధి అవకాశాలు స్థానికులకు లభిస్తాయని తెలిపారు. వలంటీర్స్ ఈ రంగాన్ని తమ కెరీర్ గా మలుచుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఆతిథ్య రంగం, ఏకో టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, మెడికల్ టూరిజం, హెరిటేజ్ అండ్ కల్చర్ టూరిజం ఇలా ఎన్నో రకాల టూరిజం ఉన్నాయని, దీని ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచానికి తెలుస్తాయన్నారు. మునుముందు ఈ రంగం ఇతర రంగాలతో పోటీ పడుతుందని, భారత ప్రభుత్వం 2028 వరకు ఒక కోటి 40 లక్షల ఉద్యోగాలు కల్పనగా కృషి చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితిలో ఉండాలని శివాజీ కోరారు. అలాగే అతిథి డాక్టర్ వంశీ టూరిజం డిపార్ట్మెంట్ వారు మాట్లాడుతూ టూరిజం రంగంలో ఉన్న అవకాశాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ "యువ టూరిజం క్లబ్" ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని, తద్వారా ఇతర మిత్రులను టూరిజం రంగంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. మన భారతీయ సంస్కృతిలో "అతిథిదేవోభవ" అన్న మాటను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, తద్వారా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నవ్య శ్రీ, హరిణి, ఫయాజ్, శ్రీ జై, అసద్, మన్నన్ తదితర సీనియర్ వలంటీర్లు పాల్గొన్నారు.

# అత్యంత విలువైన మానవ హక్కు ఆర్టీఐ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** అక్టోబర్ నెలలో జరిగే సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సు పోస్టర్లను శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ శ్రీ కె. శశాంక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికి భారత్ వంటి అనేక ప్రజాస్వామ్య దేశాలలో సమాచార హక్కు ప్రాథమిక హక్కులలో భాగంగా అత్యంత విలువైన మానవ హక్కుగా గుర్తించారన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి అవగాహన పెంచుకోవడానికి కూడా సమాచార హక్కు ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని శక్తివంతమైన సాధనంగా ఉపయోగించాలని, అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విద్యా అధికారులు, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, మైనింగ్ అధికారులు, మెడికల్ సిబ్బంది, అంగన్వాడీ ఉద్యోగులు, అన్ని శాఖల అధికారుల సమక్షంలో విద్యార్థులకు, యువకులకు సమాజంలో సమాచార హక్కు చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏ ఏ కార్యక్రమాలు ప్రజలకు అవసరం పడతాయని అవగాహన కల్పించుటకు జాతీయ, రాష్ట్ర కమిటీ అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, ఆర్టీఐ రంగారెడ్డి జిల్లా సభ్యులు రామగళ్ల శ్రీనివాస్, దొడ్డి రాజు యాదవ్, కాకి శేఖర్, ఉడుగుల మధు, తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరికి వరంగల్ బార్ అసోసియేషన్ నివాళి




**వరంగల్ వాయిస్, సుబేదారి:** ప్రముఖ కమ్యూనిష్టు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, జేఎన్ యూ పూర్వ విద్యార్థి నేత, కామ్రేడ్ సీతారాం ఏచూరికి వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ హాల్ లో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ మాట్లాడుతూ పీడిత, తాడిత అణగారిన వర్గాల వైపు నిలబడి గొంతుకై ఎలుగెత్తిన వామపక్ష యోధుడు కామ్రేడ్ ఏచూరి అని కొనియాడారు. కార్మికుల కోసం, కర్షకుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన యోధుడని, ఏచూరి మరణం వామపక్షాలకు తీరని లోటన్నారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో అడుగుపెట్టిన దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా జాతీయ రాజకీయాల్లో ఆయన క్రియాశీలంగా వ్యవహరించారని గుర్తు చేశారు. దేశ రాజకీయాలలో చరిత్ర సృష్టించిన మహా నాయకుడు ఏచూరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లాడే రమేష్,బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ నబీ, న్యాయవాదులు గంజి గణేష్, కొత్తపెల్లి చిరంజీవి, డాక్టర్ సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ, షేక్ రఫీ, సిరిమల్ల అరుణతో పాటు రాజు, విక్రం తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానాలు.. కుంకుమ పూజలు

## మార్మోగుతున్న లంబోదరుడి నామస్మరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని వివిధ డివిజన్ లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విఘ్నాధిపతికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండ గోపాల్ పూర్ బృందావన కాలనీలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు రచ్చ నాగేశ్వరరావు, దూలం తిరుపతి, లక్ష్మీ నరసయ్య, పూర్ణచందర్ ఆధ్వర్యంలో మహిళలు రచ్చ పద్మ, కౌడగాని కవిత, నాగ సింధు, వాణి, రమ, అంచూరి కవిత, నిర్మల తదితరులు కుంకుమ పూజలను భక్తి ప్రభత్తులతో నిర్వహించారు. విఘ్నాధిపతికి నైవేద్యం, పాయసం సమర్పించుకొని అర్చనలు అభిషేకాలు చేశారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపాల్ పూర్ లోని దేవరాజు కాలనీలో శ్రీ సాయి గజానన మండలి అధ్యక్షుడు దూలం రాజు గౌడ్ ఆధ్వర్యంలో మహిళలు దూల నీరజ గౌడ్, దూలం రవీంద్రాదేవి, వల్లాల శ్రీజ, లక్ష్మి, స్వప్న, కావ్య పూజలు చేశారు. భక్తుల భజన కీర్తనలతో లంబోదరుడు నామస్మరణ మండపాల్లో మార్మోగింది.

శుక్రవారం 13, సెప్టెంబర్ 2024
www.warangalvoice.net

# బాలల హక్కులపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్డు :** హనుమకొండ జిల్లా షేర్ స్వచ్ఛంద సంస్థ, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హంటర్ రోడ్డు న్యూ శాయంపేటలో గల తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ బాలికల పాఠశాలలో బాలల హక్కులు, బాలల రక్షణ, సంరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల నీరజ అధ్యక్షత వహించారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, కౌన్సిలర్ ఇక్బాల్ పాషా మాట్లాడుతూ బాలలు మన దేశ సంపద, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవలసిన పూర్తి బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన దేశంలో ప్రతినిత్యం పిల్లలపై జరిగే వేధింపుల, లైంగిక నేరాలు పెరగడం చాలా విచారకరమని, వీటిని కట్టడి చేయడానికి 18 ఏళ్ల లోపు బాలబాలికల రక్షణ సంరక్షణ కోసం 2012 పోక్సో చట్టం ద్వారా శిక్షలు విధిస్తుందన్నారు . బాలబాలికలు తమకు సమీప బంధువులతో చనువుగా ఉండవద్దని, వారిని గౌరవిస్తూ మసలుకోవాలని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ విశేషంగా పని చేస్తోందన్నారు. పిల్లలు ఎలాంటి అపదలో ఉన్నా బాలల నేస్తం చైల్డ్ లైన్ 1098, అలాగే 100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సత్వరం సహాయం పొందవచ్చని తెలిపారు. ఉంక్రసీ (యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద రైట్స్ ఆఫ్ ద చైల్డ్) నిబంధన 19 ప్రకారం ఈ ఒప్పందంలోని భాగస్వామ్య దేశాలన్నీ పిల్లల తల్లిదండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు లేదా బాగోగులు చూసుకునే మరెవరి సంరక్షణలో నైనా ఉన్నప్పుడు లైంగిక వేధింపులు, శారీరక లేదా మానసిక హింస, గాయం లేదా వేధింపు, నిర్లక్ష్యం, నిరక్ష్య వైఖరి, తిండి పెట్టకపోవడం లేదా దోపిడీలకు గురి కాకుండా చట్ట, పాలనాపర, సామాజిక, విద్యాపరమైన చర్యలను తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని రకాల వేదింపులు, నిర్లక్ష్యాల నుంచి రక్షణ పొందే హక్కు బాలలకు ఉందని యూఎన్ సీఆర్సీ స్పష్టం చేస్తోందని తెలిపారు. బాలలు 12 సంవత్సరాల పాటు పాఠశాలలలో గడుపుతారు కాబట్టి, పాఠశాల యాజమాన్యం, పిల్లల కుటుంబాలు వారి సంరక్షణ కై ప్రధాన భూమికను నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలతో శారీరక వికలత్వం, మానసిక ఎదుగుదల లేని పిల్లలు జన్మిస్తారని తెలిపారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, కమ్యూనిటి మొబైలెజర్ భూక్యా జగన్ మాట్లాడుతూ బాలల హక్కులు, మానవ హక్కులు, మంచి స్పర్శ, చెడు స్పర్శల గురించి, బాలల బాధ్యతలు గురించి వివరించారు. అనంతరం బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా, బాలల హక్కులు, రక్షణకై బాలికలు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా బోయిని నాగరాజు అనే వ్యక్తి వాళ్ల ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిలువ ఉంచారని సమాచారం మేరకు, వారి ఇంటి వద్దకు వెళుతుండగా పోలీసు రాకను గమనించిన సదరు వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకొని విచారించగా అతడి పేరు బోయిన నాగరాజు అని తెలపడంతో అతడిని అదుపుకలోకి తీసుకున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని గ్రామంలో వివిధ వ్యక్తుల దగ్గర పీడీఎస్ రైస్ ను సేకరించి ఎక్కువ ధరకు అమ్ముకుందామని నిల్వ ఉంచానని నిందితుడు తెలిపాడు. వెంటనే శాయంపేట పోలీసులు ఆ నిల్వ ఉంచిన పీడీఎస్ రైస్ ను, నిందితుని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు.

## సుదీర్ఘ కాల సమస్య - సుగుమం చేసిన నేత

### చరిత్ర తిరగరసిన రాజేంద్రుడు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మా ఆపద మీదనుకోని-అండగా నిలిచి చిరకాల కోరిక పట్ల మహానగరానికి నూతన అధ్యయనం చేసిన నయింనగర్ బ్రిడ్జి నిర్మాణం పట్ల వ్యాపార వర్గాల శ్రేణులు తమ కృతజ్ఞతను వినూత్నంగా చాటుతూ శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డికి తమ కృతజ్ఞతా భావాన్ని చాటుతూ చవాన్ వేణు ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తా వ్యాపార వర్గాల శ్రేణులు సీపీ రెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో పూలతో అభిషేకం చేశారు. ఈ వేడుకలో వ్యాపారులు, సీపీ రెడ్డి కాంప్లెక్స్ అధ్యక్షుడు తంగళ్లపల్లి గిరిధర్, బట్టల వ్యాపారుల తరపున జమంజోతి రాజు, శ్రీను, ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు లింగమూర్తి, పన్నాల ఆదిత్య మూర్తి, లక్కం రాజు, టైలర్స్ అసోసియేషన్ తరపున ఓంకార్ మరిన్ని వ్యాపార సంస్థల నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా వ్యాపార వర్గాల వారు మాట్లాడుతూ గత పాలకుల అలసత్వం అని తెలిసి కూడా ఏ ఒక్కరోజు ప్రస్తావించని నాయకుడు రాజేందర్ రెడ్డి అన్నారు. పెద్ద మోరి సమస్య పరిష్కరించాలని ఏ ఒక్కరు కూడా ఎమ్మెల్యే దృష్టికి ఎన్నికల ముందు తీసుకువెళ్లలేదు. సాకులు వెతుకులాడుకొని సమస్యల పక్కనపెట్టి కాలయాపన చేసిన రాజకీయ నాయకులు ఎందరో చూశాం. నయింనగర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అన్యాక్రాంతానికి గురైన స్థలాలను వెనక్కి తీసుకొచ్చిన ఏకైక నాయకుడు రాజేందర్ రెడ్డి అని కొనియాడారు. ఎన్నో ఏళ్లుగా వర్షాకాల వరదలలో కొట్టుమిట్టాడే చాలా ప్రాంతాలకు చరిత్రలో నిలిచిపోయే ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించిన నేతకు ఈ సన్మానం చాలా చిన్నదని అన్నారు. ఎమ్మెల్యే గా గెలిచిన అనతి కాలంలో (9నెలల వ్యవదిలో) మహెూత్తర అభివృద్ధి చేసిన ఏకైక నాయకుడని కొనియాడారు. రానున్న రోజులో ఎమ్మెల్యే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వాణిజ్య వ్యాపార వర్గాలకు, మహానగర ప్రజలకు మేలు చేయాలని ఆకాంక్షించారు.

# బీజేపీ మత రాజకీయాలను ఎండగట్టండి

### సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు

### ఘనంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 1946 నుంచి 1951 వరకు కుల, మతాలతో సంబంధం లేకుండా తెలంగాణ ప్రాంతంలో వీరోచితంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, చరిత్ర పట్ల కనీస అవగాహన లేని బీజేపీ తన మత రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరించాలని ప్రయత్నిస్తున్నదని, మహెూన్నత పోరాట వారసత్వం కలిగిన తెలంగాణ ప్రజలు బీజేపీ మతోన్మాద కుట్ర రాజకీయాలను అడ్డుకోవాలని సీపీఐ ఎంఎల్ (ప్రజాపంథా) మాస్ లైవ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి, కామారెడ్డి గూడెంలోని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరులు దొడ్డి కొమురయ్య ,షేక్ బందగీల స్థూపాల వద్ద ఘనంగా నివాళులర్పించి, తెలంగాణ రైతంగ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రారంభిస్తూ, పోరాటంలో అమరులైన వీరులను స్మరిస్తూ, స్మారక సభలు నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య స్తూపం వద్ద నుంచి షేక్ బందగి స్తూపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోటు రంగారావు మాట్లాడుతూ నాడు తెలంగాణ ప్రజలు నైజం నిరంకుశ పాలనకు, రజకారుమూకల దౌర్జన్యాలకు, పటేల్, పట్వారీ, భూస్వామ్య రాచరిక బానిసత్వంపై తిరగబడి, భూమి, భుక్తి, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కొనసాగించారని గుర్తు చేశారు. 1948 సెప్టెంబర్ 17న నైజాం ప్రభుత్వం లొంగిపోతే, తెలంగాణలో 1951 వరకు యూనియన్ సైన్యాలకు ఎవరిని అణచడానికి ఉండాల్సి వచ్చిందో ప్రజలంతా తెలంగాణ నిజమైన చరిత్రను తెలుసుకోవాలని కోరారు. అందుకే చరిత్రలో 1948 సెప్టెంబర్ 17 న తెలంగాణ ప్రజలకు జరిగింది విమోచన కాదు !వీలినం కాదు! ముమ్మాటికి విద్రోహమేనని తెలిపారు. అందుకే తెలంగాణ ప్రజలంతా సెప్టెంబర్ 17న తెలంగాణ విద్రోహదినంగా పాటించాలని, సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను గ్రామ, గ్రామాన విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోకినపెల్లి వెంకటేశ్వర్లు, చంద్రన్న, ఆవుల వెంకటేశ్వర్లు, జి.సదానందం, రాష్ట్ర నాయకులు సీఐ పుల్లయ్య, కొత్తపల్లి రవి, వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత కుంగ్ ఫూ తరగతులు

### ప్రారంభించిన చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్తవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గిర్మాజిపేటలో మాస్టర్ రోడ్డబోయిన కోటేశ్వర్ ఆధ్వర్యంలో రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమం 2024-25లో భాగంగా 8, 9 తరగతుల బాలికల కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గిర్మాజీపేటలో ఉచిత కుంగ్ ఫు (కరాటే)శిక్షణా తరగతులను టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత, స్కూల్ హెడ్మాస్టర్ పి.రాజమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 5748 పాఠశాలల్లో 8 కోట్ల 62 లక్షల 20వేల రూపాయల ఖర్చుతో మూడు నెలల కాల వ్యవధిలో కరాటే కుంగ్ ఫు మాస్టర్లకు నెలకు రూ.5000 చొప్పున గౌరవ వేతనం ఇస్తూ బాలికలను సెల్ఫ్ డిఫెన్స్ ఆత్మరక్షణ కోసం తమను తాము ఎలా రక్షించుకోవాలో ఈ శిక్షణ ద్వారా నేర్పించడం జరుగుతుందన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. బాలికలు ఈ మూడు నెలలు పాఠ్యాంశాలతో పాటుగా ఈ సెల్ఫ్ డిఫెన్స్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కరాటే కుంగ్ ఫూ క్లాసులను సద్వినియోగం చేసుకొని, తమను తాము రక్షించుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. ప్రజా ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను చేసి ముందుకు వెళు తుందని, పోలీస్ విభాగంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేసి ఈవ్ టీజింగ్ లాంటి చర్యలను అరికడుతూ, ఒక్క మిస్డ్ కాల్ తో మహిళలకు రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ పి.నాగమణి, పి.బుచ్చిరెడ్డి, వి.సంపత్ కుమార్, ఎండీ. అఫ్సర్, మాస్టర్ ఆర్.కోటేశ్వర్, ఎస్ డీ యాకూబ్ పాల్గొన్నారు.

## రేపు ఉత్తమ వినాయక మండపాలకు జ్ఞాపికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 30 సంవత్సరాల క్రితమే కేబుల్ వార్తలకు శ్రీకారం చుట్టిన ప్రఖ్యాత యూట్యూబ్ ఛానల్ "వరంగల్ దర్శన్"వారి ఆధ్వర్యంలో నగరంలోని ఉత్తమ వినాయక మండపాలను ఎంపిక చేసి రేపు జ్ఞాపికల ప్రదానం చేయనున్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు రామప్ప విద్యార్థులు



**వరంగల్, హనుమకొండ :** జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో బేస్ బాల్ ఈవెంట్ లో ఈ నెల 11న జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రేపు నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన సామ్యూల్, రాహుల్, శ్రీజ, శ్రీవల్లి లు ఎంపిక అయ్యారని రామప్ప జూనియర్ కళాశాల డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డైరక్టర్ ఐలి కర్ణాకర్ మాట్లాడుతూ కేవలం విద్యలోనే కాకుండా క్రీడా రంగంలో కుడా రాణించాలని, అందుకు మా కళాశాల ఎప్పుడూ ప్రోత్సహం ఇస్తుంది, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ కోచ్ కమల్, వినోద్, పూర్ణచందర్, ఏవో సతీష్ కుమార్ పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# హాలీవుడ్‌లో దేవర ప్రదర్శన

## అభిమానుల్లో జోష్ పెంచిన వార్త

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దేవర'భారీ అంచనాల మధ్య 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త అభిమానుల్లో జోష్ నింపుతోంది. హాలీవుడ్‌లో జరగనున్న ఓ ఈవెంట్లో 'దేవర'ను ప్రదర్శించనున్నారు. కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెలిస్‌లో జరగనున్న అతిపెద్ద జానర్ ఫిల్మ్ ఫెస్టివల్ 'బియాండ్ ఫెస్ట్'లో 'దేవర'ను ప్రదర్శించనున్నారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు ఈ ఈవెంట్ జరగనుంది. సెప్టెంబర్ 26 సాయంత్రం ఈజిప్టియన్ థియేటర్‌లో ఈ సినిమాను హాలీవుడ్ ప్రేక్షకులు, ప్రముఖులు దీన్ని వీక్షించనున్నారు. దీనికోసం ఎన్టీఆర్ సెప్టెంబర్ 25న అమెరికా వెళ్లనున్నారని సినీవర్గాలు తెలిపాయి. ఈ విషయం తెలిసిన అభిమానులు తెగ సంబరపడుతున్నారు. తాజాగా దీని ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఎన్టీఆర్ సినిమాపై అంచనాలు పెంచేశారు. 'దేవర' విజువల్స్ అద్భుతంగా ఉంటాయన్నారు. చివరి 40 నిమిషాల సినిమా విశేషంగా ఆకట్టుకుంటుందని తెలిపారు. ఈ సినిమాతో జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి వస్తున్నారు. సైఫ్ అలీఖాన్ కీలకపాత్రలో కనిపించనున్నారు. యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోన్న ఈ సినిమా ప్రీసేల్ బుకింగ్స్‌లోనే పలు రికార్డులు సొంతం చేసుకుంది. నార్త్ అమెరికన్ బాక్సాఫీస్‌లో అత్యంత వేగంగా టికెట్ల ప్రీసేల్ ద్వారానే వన్ మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరిన సినిమాగా 'దేవర' నిలిచింది. ట్రైలర్ కూడా రిలీజ్ కాకముందే ఈ ఘనత సాధించిన మొదటి భారతీయ చిత్రంగా రికార్డు నెలకొల్పింది. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ కూడా మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.





# మర్డర్ కేసు ఛేదన..

## మత్తువదలరా`2


కొనసాగింపు సినిమాలకు, ఫ్రాంఛైజీలకు తెలుగు చిత్రసీమ బాగా అలవాటుపడిపోయింది. ఆ కోవలో రూపొందిన చిత్రమే మత్తు వదలరా 2. ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు శ్రీ సింహా కథానాయకుడిగా మత్తు వదలరాతో పరిచయమై మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆ చిత్రానికి కొనసాగింపుగా అదే బృందం చేసిన ప్రయత్నమే మత్తువదలరా 2. డెలివరీ ఏజెంట్స్ ఉద్యోగాలు ఊడటంతో బాబూ మోహన్ (శ్రీసింహా), యేసు (సత్య) ఎన్నో పాట్లు పడి హై ఎమర్జెన్సీ టీమ్‌లో స్పెషల్ ఏజెంట్స్‌గా చేరతారు. కిడ్నాప్ కేసుల్ని ఛేదించి, నిందితుల్ని పట్టుకోవడంలో ఆరితేరిపోతారు. ఆ క్రమంలోనే చేతివాటం ప్రదర్శిస్తూ కొద్ది మొత్తంలో డబ్బు తస్కరిస్తూ ఎవ్వరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతుంటారు. ఇలా కొంచెం కొంచెం సంపాదన ఎంత కాలమని, కొడితే కుంభ స్థలాన్ని కొట్టాలని ఓ నిర్ణయానికొస్తారు. ఆ సందర్భంలోనే ఓ కిడ్నాప్ కేసు వస్తుంది. రూ.2 కోట్లు లావాదేవీలతో ముడిపడిన కేస్ అది. ఆ కేసును ఛేదించి, దాంతో సంబంధం ఉన్న రూ.2 కోట్లు సొంతం చేసుకుకోవాలనే వ్యూహంతో రంగంలోకి దిగుతారు. కానీ, అనూహ్యంగా కిడ్నాప్‌నకు గురైన యువతి వీళ్ల కారులోనే శవమై తేలుతుంది. వీళ్లే కిడ్నాప్ చేశారనే రుజువుతో కూడిన ఓ వీడియో కూడా బయటికొస్తుంది. మరింతకీ ఆ హత్య చేసిందెవరు? ఈ కేస్ నుంచి బాబు మోహన్, యేసు బయట పడ్డారా? లేదా? డబ్బు సంపాదించాలనే వీళ్ల కోరిక నెరవేరిందా అన్నదే చిత్ర కథ. కొనసాగింపు చిత్రం అనగానే అంతకుముందు వచ్చిన సినిమాతో పోల్చి చూడటం మొదలవుతుంది. అయితే కథ, కథనాల పరంగా మెరుపులు లేకపోవడం ఈ సినిమాకి ప్రధాన లోపం. తొలి సినిమా తరహాలోనే బాబూ మోహన్, యేసుదాసుకి డబ్బుపై ఆశ పుట్టడం, తస్కరణ కోసం ప్లాన్ చేయడం, తీరా కథ అడ్డం తిరిగి సమస్యల్లో చిక్కుకోవడం, వాటినుంచి బయట పడేందుకు పడే పాట్లు, ఆ పాట్లు పుట్టించే హాస్యం. ఇదే మత్తువదలరా 2 కూడా. తొలి సినిమాలోని 'ఓరి నా...' సీరియల్ ఇందులోనూ కొనసాగుతుంది. కాకపోతే, ఈసారి రచనలో బలం లేకపోవడంతో తొలి సినిమా స్థాయిలో సహజంగా, ఆ మోతాదులో హాస్యం పండదు. డెలివరీ ఏజెంట్స్ కాస్త స్పెషల్ ఏజెంట్స్ ఎలా అయ్యారో, వాళ్ల తస్కరణ ఈసారి ఎలా సాగుతుందో చూపిస్తూ సినిమాని మొదలుపెట్టాడు దర్శకుడు. ఆ సన్నివేశాలన్నీ నవ్వుల్ని పంచుతాయి. రూ.2 కోట్లతో ముడిపడిన కిడ్నాప్ వ్యవహారం నుంచే కథలో డ్రామా మొదలవుతుంది. ఊహించని విధంగా ఆ కిడ్నాప్ కేసు ప్రధాన పాత్రధారుల మెడకు చుట్టుకోవడం, దాన్నుంచి వాళ్లు బయట పడేందుకు చేసే ప్రయత్నాలు ఆకట్టుకుంటాయి. విరామ సన్నివేశాలు కథకి మంచి మలుపునిస్తూ ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతాయి. హత్య కేసు నుంచి ఆ ఇద్దరూ ఎలా బయట పడతారన్నది ద్వితీయార్ధంలో కీలకంగా మారుతుంది. తాము ఆ కేసులో ఎలా ఫ్రేమ్ అయ్యామో ప్రధాన పాత్రధారులు కనుక్కుంటూ, అసలు సూత్రధారులెవ్వరో కనిపెట్టే క్రమం సినిమాని ఓ ఇన్వెస్టిగేషన్ డ్రామాగా మార్చేసింది. ఈ తరహా చిత్రాల్లో చమత్కారాన్ని ఆస్వాదించాలి కానీ, తర్కం గురించి ఆలోచించకూడదు.కాల భైరవ సంగీతం చిత్రానికి ప్రధాన బలం. కెమెరా, ఎడిటింగ్ విభాగాలూ చక్కటి పనితీరుని కనబరిచాయి.



# కరణ్ సలహాతో..

## తెలుగులోకి జాన్వీ ఎంట్రీ

శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీకి వచ్చిన జాన్వీకపూర్ వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూనే టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకున్నారు. అయితే ఈ అమ్మడు టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వడం వెనక ఓ స్టార్ దర్శకనిర్మాత ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌లో ఎంతో మంది నటీనటులు వారి కెరీర్ గురించి కరణ్ జోహర్ సలహాలు తీసుకుంటూ ఉంటారని టాక్. అలానే జాన్వీకి కూడా కరణ్ ఓ సూచన చేశారట. బీటౌన్‌లో తొలి అవకాశం అందుకున్న తర్వాత జాన్వీ తమిళ, తెలుగులో ఛాన్స్‌లు వచ్చాయని దీంతో ఆమె కోలీవుడ్.. టాలీవుడ్‌లలో దేన్ని ఎంచుకోవాలో కరణ్‌ను సలహా కోరినట్లు సమాచారం. ఎన్టీఆర్ సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తే తెలుగులో మంచి ఛాన్స్‌లు వస్తాయని కరణ్ ఆమెతో చెప్పారట. దీంతో జాన్వీ వెంటనే 'దేవర'ను ఓకే చేసేశారు. కరణ్ సలహా ఈ భామకు కలిసొచ్చినట్లే ఇక్కడ స్టార్ హీరో సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు. ఎన్టీఆర్‌తో సినిమా చేస్తుండగానే మెగా హీరో రామ్ చరణ్ సరసన ఛాన్స్ కొట్టేశారు. నానితో కూడా ఓ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తల వస్తున్నాయి. బీటౌన్‌లో జాన్వీ ఇప్పటి వరకు చిన్న హీరోల సినిమాల్లోనే నటించారు. కానీ, తెలుగులో మాత్రం తొలి సినిమానే ఎన్టీఆర్‌తో ఆడిపాడ నున్నారు. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్స్‌కు పోటీ ఇవ్వలేని జాన్వీ.. ఇక్కడ మాత్రం టాప్ లిస్ట్ హీరోయిన్స్‌కు గట్టిపోటీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'దేవర'లో ఇప్పటి వరకు రిలీజైన పాటల్లో జాన్వీ అందానికి, డ్యాన్స్‌కు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. తాజాగా రిలీజైన 'దావుదీ..' సాంగ్‌లో ఎన్టీఆర్‌తో సమానంగా డ్యాన్స్ వేసిందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. దీంతో ఈ సినిమా విడుదలయ్యాక జాన్వీ మరిన్ని అవకాశాలు అందుకోవడం ఖాయమని వారు భావిస్తున్నారు.



# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



- జఫర్ గఢ్ మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా...
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** జఫర్ గఢ్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకొని నియోజకవర్గంలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుకుందామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం జఫర్ గఢ్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మండల కేంద్రంలోని వాడవాడకు, గల్లీగల్లికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో నిండు మనసుతో ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎవరెన్ని అసత్యాలు, దుష్ప్రచారాలు చేసినా వారందరికీ బుద్ధి చెప్పే విధంగా తీర్పు ఇచ్చిన అందరికీ శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. మన గ్రామాన్ని, మండలాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మీ అందరి సహకారం చాలా అవసరమన్నారు. నా దృష్టికి వచ్చిన సమస్యలను అన్నింటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. మెదటి సారి ఎమ్మెల్యే గా గెలిచినప్పుడు జఫర్ గఢ్ గ్రామానికి బీటి రోడ్డు వేయించానని తెలిపారు. జఫర్ గఢ్ మండలాన్ని విద్యా కేంద్రంగా మార్చినట్లు వివరించారు. త్వరలోనే జఫర్ గఢ్ మండలంలో బ్యాంక్ అఫ్ బరోడా బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గొప్ప చరిత్ర కలిగిన వేల్పుగొండ లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామని, గుట్ట పైకి సీసీ రోడ్డు, మెట్లు, లైటింగ్, కోనేరు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుందామన్నారు. అలాగే మండల కేంద్రంలోని రామాలయం, శివాలయం, హనుమాన్ గుళ్లను ఆలయ కమిటీలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసకుందామని తెలిపారు. మండలంలోని పెద్ద చెరువును రిజర్వాయర్ చేయాలి, కట్ట మరమ్మత్తు చేయాలని, దానికోసం ఇప్పటికే రూ.6కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. మండల కేంద్రంలోని హన్మకొండ దర్వాజ నుంచి ఓబులాపూర్ క్రాస్ వరకు నాలుగు లైన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. మండల కేంద్రంలో ఇంటర్నల్ సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి 1కోటి రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో తహసీల్దార్ కార్యాలయం, బస్టాండ్ నిర్మాణం చేసుకోవాల్సి ఉందని అన్నారు. నీటి పారుదల శాఖ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు అందించాలని, నష్కల్ నుండి పాలకుర్తి కి వెళ్లే కాల్వల ద్వారా ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందిస్తానని అన్నారు. గ్రామంలో పర్యటించే క్రమంలో దాదాపు 30వరకు సమస్యలు నా దృష్టికి వచ్చాయని అన్నారు. అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని, ఏడాదిన్నర కాలంలో జఫర్ గఢ్ మండలంలో మీరు గుర్తించే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. జఫర్గడ్ మండలాన్ని వరంగల్ జిల్లాలో కలపాలనే డిమాండ్ ఉందని అన్నారు. జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ విభజన ప్రక్రియ చేపడితే జఫర్ గఢ్ మండలాన్ని వరంగల్ జిల్లాలో కలిపే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వరంగల్ జిల్లాను 6 ముక్కలు చేసి కాకతీయ సామ్రాజ్య పరువును, ప్రతిష్టను నాశనం చేశారని మండిపడ్డారు. ఈ విషయంలో అప్పటి ముఖ్యమంత్రితో తీవ్రంగా విభేదించానని అందుకే మంత్రి పదవి పోగొట్టుకున్నాని అన్నారు. జిల్లాల విభజన విషయంలో తప్పుడు నిర్ణయం జరిగిందని, దానిని సరి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నాది ఏ జిల్లానో చెప్పుకోలేని అయోమయ పరిస్థితిలో ఉన్నానని, కచ్చితంగా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మీ అందరి సహకారం లేకుండా నేను ఏమి చేయలేనని, అభివృద్ధి విషయంలో మీ అందరి ప్రోత్సాహం చాలా అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మహా గణపతికి నైవేద్యంగా బాహుబలి లడ్డు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మణికంఠ కాలనీ డెవలప్ మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ మహాగణపతి నవరాత్రి ఉత్సవం ఆరవ రోజు సందర్భంగా బయ్య అశోక్ –స్వప్న 216 కిలోల లడ్డును మహా గణపతికి నైవేద్యంగా పెట్టారు. బాహుబలి లడ్డు శోభయాత్ర లడ్డు దాత భయ్యా స్వప్న అశోక్ ఇంటి నుంచి 100 ఫీట్ రోడ్డు మీదుగా పోచమ్మ టెంపుల్ నుంచి మణికంఠ కాలనీ డెవలప్ మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ మహాగణపతి మండపం వద్దకు అధ్యక్షుడు పోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కాలనీ మహిళలు మంగళ హారతుల తో తీసుకువచ్చారు. పిల్లలు పెద్దలు, కమిటీ సభ్యులు వ్యాపారవేత్తలు, ఆర్ఎస్ఎస్ సంఘ సేవ కార్యకర్తలు, బజరంగ్ దళ్ కార్యకర్తలు , రాజకీయ నాయకులు, 14 డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంతియాజ్, సిలువేరు శ్రీనివాస్, 14వ డివిజన్ బీజేపీ నాయకులు ముదుసు నరసింహ, దూపం సంపత్ కుమార్, గుండేటి నరేందర్, నర్సంపేట మున్సిపల్ చైర్మన్ గుంటి రజనీ కిషన్, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రెజరర్ కంచ సంపత్, అడ్తి సెక్షన్ మాజీ అధ్యక్షుడు పోతు కుమార్ స్వామి, వ్యాపారవేత్తలు నందిని చిల్లీస్ సదానందం, మాడిశెట్టి శ్రీధర్, విజయ భాను పాల్గొన్నారు.



## ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

### గణనాథుడికి ఎంపీ కడియం కావ్య పూజలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని హనుమకొండ నక్కలగుట్టలో జీడబ్ల్యూఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి మండపాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సందర్శించి, గణనాథున్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వాడవాడనా కొలువుదీరిన గణనాథుల ఆశీర్వాదం ప్రజలకు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి డబ్ల్యూ ఎం సి హనుమకొండ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో వసతుల కల్పనపై కలెక్టర్ దృష్టి

- కమలాపూర్ లో విద్యార్థినులతో కలిసి రాత్రి బస
- క్రీడలు, మెడిటేషన్ తో ఉత్సాహం నింపిన ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో రాత్రి బస అనంతరం శుక్రవారం ఉదయం విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాఠశాల మైదానంలో రన్నింగ్, వార్మప్, మెడిటేషన్ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్ వాలీబాల్, షటిల్ ఆడి విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని నింపారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులతో కలిసి కలెక్టర్ మొక్కను నాటారు. విద్యార్థులకు ఉదయం అందించే అల్పాహారంలో భాగంగా కలెక్టర్ విద్యార్థినులతో కలిసి రాగి జావా, టిఫిన్ చేశారు. డైనింగ్ హాల్ కు సంబంధించిన రిజిస్టర్స్, ఫుడ్ మెనూ, మెడికల్, తదితర రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు వసతుల కల్పన, వారికి అందించే ఫుడ్ మెనూ స్వయంగా పర్యవేక్షించేందుకు రాత్రి బస చేయడంతో పాటు వారి రోజువారి దినచర్య ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు రాత్రి బస చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం కమలాపూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థునులతో మాట్లాడి రోజువారి దినచర్య లో భాగంగా మెనూ, వసతి, పుస్తకాలు, దుస్తుల గురించి అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, ప్రిన్సిపల్ సౌజన్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణవేణి, పీఈటీ సంగీత, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## నిమజ్జన ఏర్పాట్లపై క్షేత్ర స్థాయి సమీక్ష

### కోట చెరువును పరిశీలించిన సీపీ, కలెక్టర్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఈ నెల 16న ట్రై సిటీ పరిధిలో నిర్వహించే గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి వరంగల్ నగరంలో గణేష్ ప్రతిమలు నిమజ్జనం చేసే చెరువుల్లో ఒకటైన కోట చెరువును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, మున్సిపల్ కమిషనర్ అశ్వనీ తానాజీ వాకడే, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్, ట్రాఫిక్ ఏసీపీలు నందిరాం నాయక్, సత్యనారాయణతో పాటు నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, విద్యుత్తు, స్థానిక పోలీస్ అధికారులతో నిమజ్జన చెరువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# అభయకు న్యాయం చేద్దాం..

- కుటుంబానికి అండగా ఉందాం..
- బొజ్జ గణపయ్యల వద్ద వైద్యుల వినూత్న నిరసన
- ఫ్లెక్సీ పెట్టి న్యాయం చేయాలంటూ ప్రదర్శన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని వైద్యులంతా కలిసి అభయ కుటుంబానికి అండగా ఉంటామని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని వినూత్న నిరసనకు తెర లేపారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని పలు మండపాల వద్ద నిర్వహించారు. అభయకు న్యాయం జరగాలని ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ మండపాల వద్ద నిరసన తెలుపుతూ జరిగిన ఘటనపై ప్రజలకు తెలియజెప్పారు. బైకులపై తిరుగుతూ ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభయ కుటుంబానికి న్యాయం జరిగేలా చొరవ చూపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.